# మనసారా...

గాంధీ జయంతి సంబరాలంటే అందరికీ ఆనందమే. అది జాతి పిత ఉత్సవం కదా! తన 125వ జయంతి ఆర్భాటంగా చేస్తున్నారంటే విని తెలుగువారు ఉత్సాహవంతులు కదా అని, గాంధీజి గబగబా కర్రేసుకుని చకచకా వచ్చేశారు హైద్రాబాదు.

ఆ రోజు ఉదయం కొందరు తన బొమ్మలమీద ధూళి తుడుస్తున్నారు. మరికొందరు తన బొమ్మలు కడుగుతున్నారు. మరికొందరు ఊడినకర్ర, జారిన కళ్ళజోడు సంచేస్తున్నారు. అబ్బ ఎంత భక్తి! అనుకొని గాంధీగారి బోసినవ్వు ఆకాశంలో గలగల లాడింది.

ఒకడు గాంధీ టోపి పెట్టుకుని బ్రహ్మాండమైన ఉపన్యాసం యిస్తున్నాడు- గాంధీ చెప్పిన సూక్తి- మసం తాగరాదు- తాగించరాదు అంటూ ఓ నాయకుడు- అయితే ఆయన కళ్ళు గతరాత్రి తాగిన మద్యంతో నిద్రలేక ఎరుపెక్కి పోయున్నాయి. ఓ క్షురకారు గాంధీ గురించి పొగిడేస్తున్నాడు. 'ఓరి తస్సాదియ్యా! వీడు నా మొహమైనా తెలియకుండా పొగిడేస్తున్నాడే' అనుకున్నారు గాంధీ- బ్రాందీషాపులన్నీ ముందు తలుపులు మూసి వెనక తలుపులు తెరుచుకున్నాయి. ఆడవాళ్ళు బారులుబారులుగా గాంధీ బొమ్మదగ్గరకు వచ్చారు నగరం నడిబొడ్డులో. ఆయన బొమ్మకు దండం పెట్టారు. దండ వేశారు- చివరికి ఆయన పాదాలదగ్గరే కూర్చున్నారు. ఆయన పాపం యింకా బ్రతికున్నాడనే భ్రాంతితో. గాంధీ టోపీతో ఎవరైనా నాయకుడు దండ వేయడానికి వస్తే 'బాబూ నీకా హక్కులేదు. ముందు మద్యనిషేధం అమలు పరుచు' అని అడ్డుకున్నారు.

ఓ గాంధీ టోపీ నాయకుడికి ఒళ్ళుమండి పోలీసులతో గుసగుసలాడాడు- మంచి అవకాశం వచ్చిందని రొమ్ము విరుచుకుంటూ. పోలీసులు అందంగా ఉన్న అమ్మాయలమీద విరుచుకుపడ్డారు- 'ఇక్కడనుంచి పొండి- పొండి' అని- తర్వాత లాఠీలు తలలమీద, మెడలమీద, ఒంటిమీద నృత్యం చేశాయి- కొందరు స్త్రీలు గోల చేశారు. మరికొందరు సొమ్మసిల్లారు. గాందీగారు యిదంతాచూస్తూ నిస్తుపోయి ముక్కుమీద వేలేసుకున్నారు-

ఓ సభలో ..

'గాంధీగారి 14 సూత్రాలు మనం పాటించాలి' అన్నారు ఓ గాంధీ టోపీ.

'అంటే ఇంతవరకు పాటించలేదన్నమాట'- ఓ సభికుడి వ్యాఖ్య.

'మద్యం మహాత్మా! మనల్ని నాశనం చేస్తోంది' అని మరో నాయకుడు.

"అందుకే కదా! సారాపోసి జనాన్ని నాశనం చేసి ఓట్లు సంపాదిస్తున్నారు" అని వో సత్పురుషుని వ్యాఖ్య.

'సారావల్ల ఎందరొ కుటుంబాలలో ఆడవాళ్ళను మగవాళ్ళు నాశనం చేస్తున్నారు'- వో మహిళా నాయకురాలి ఉవాచ.

'అది కాదమ్మా! నువ్వే తాగడం మొదలుపెట్టాక మగవాళ్ళు నాశనం అయిపోతున్నారు' అని వో స్త్రీ సభికురాలు ఉక్రోషం.

ఇవన్నీ చూసిన నా మిత్రుడడిగాడు.

'ఎందుకయ్యా గాంధీగారిని అవమానపరుస్తూ ఎన్నికలలో గాందీ పేరిట వోట్లు అడుక్కుంటారు' అని

'చచ్చినవాళ్ళ పేరు చెప్పి పదవి సంపాదించుకోడంలో ఘనాపాఠీలు వీరు' అన్నాడు మరో మిత్రుడు.

అందరూ ఒకటే విమర్శ నాయకులపై. మద్యనిషేధంకై పోరాడే ఆడవాళ్ళు వీరనారీమణులని-

పోలీసులు కూడా అదే అన్నారు. పూర్వకాలం రుద్రమదేవి, ఝాన్సీ పేర్లు విన్నాం. ఈ మద్య నిషేధ ప్రచార తరుణంలో లాఠీ దెబ్బలుఓర్చుకోగలిగే వీరనారీమణులు ఎవరైనా ఉన్నారా అని ఊరికే టెస్టు చేశాం అని.

'అందరూ వృద్ధనారీమణులే! ఉఫ్ అంటే ఎగిరిపోయేవారే! అన్నాడో కుర్ర పోలీసు.

'ఏమిటో ఆ దృశ్యాలు బాధ అనిపించి అటుచూస్తూ ఇంటికి వచ్చాను.

ఇంట్లోకూడ ఆడవాళ్ళు ఇదే చర్చ!

ఈసారి మా ఆడవాళ్ళంతా గాంధీ బొమ్మ దగ్గర దెబ్బలుతిన్న ఆడవాళ్ళపై సానుభూతి చూపించారు.

అప్పుడే వచ్చింది మా దాసి తులసవ్వ.

బుగ్గన కిళ్లీ బిగించింది. అయినా ఆమె వేసుకున్న చుక్క ఘుమఘుమలు నాదాకా వచ్చాయి. హోరి! గాంధీ జయంతినాడుకూడా ఇది తాగివచ్చిందే. అనుకుని ముక్కు మూసుకున్నా.

మా ఆడవాళ్ల చర్చవిని తులసవ్వ వో సందేశం వదిలింది.

'ఏందమ్మగారూ! మీరు మరీని! దెబ్బలుతిన్న ఆడోళ్ళమీద మీ జాలెందుకూ! అయినా నే తెలీక అడుగుతా తాగే వాడికి వెతిరేకంగా ఉద్దెమం లేవదీయాలికానీ, తయారీ చేసేవాడిమీద యీ గొడవెందుకు! బాబూ మీరైనా చెప్పండి న్యాయం! అంది తులసవ్వ నాకేసి తిరిగి.

"నన్నెవరూ ఆపగలేరు తాగొద్దని" అనిపక్కునవ్వింది తులసవ్వ.

ఒక్క నిమిషం నిర్ఘాంతపోయాను.

'అదీ వో పాయింటే' అనుకున్నాను 'మనసారా'. మద్య నిషేధ ఉద్యమ రూపం మారాలనుకుంటూ.

కథా నిలయం
3772